ఈ కథ యిలా విషాదాంతకావడం మీకిష్టం కాకపోవచ్చు కాని వాస్తవంగా జరిగింది మరి! ఎవరైనాచెపితే నమ్మలేనట్టుగా ఉంటుందీవిషయం. కాని లోకంలో అలాంటివారున్నారని కంటిలో చూసిన మేము నమ్మకతప్పదు. ఎవరైనా యీకథే యథాతథంగా మాకుచేస్తే మేమే నమ్మలేకపోయేవాళ్ళమేమో అంటే ఆశ్చర్యంలేదు. ఆమె సున్నితహృదయం, బాబ్జీ మరణం, లోకనిందలవల్ల కల్గిన తాపానికి తట్టుకోలేకపోయింది. సంఘానికి సవతి తల్లులమీద ఇంత నిర్దాక్షిణ్యం ఎందుకో? అనవసరంగా సుందరమ్మలాంటి వ్యక్తులు శారదలాంటి వారిని బాధపెట్టి బావుకునేదేమిటో? ఈ విషయం తల్చుకున్నకొద్దీ సంఘాన్ని క్షమించలేనంతకోపం, బాధ కలుగుతాయి నాకు. కాని నేనుగూడ ఈ సమాజపు నాలుగు గోడలమధ్య వాడినేనని తల్చుకోగానే సిగ్గువేస్తుంది.

ఇది జ్ఞాపకం చేసుకున్నంత సేపూ నేనూ మాలతీ ఏడుస్తూనే ఉన్నాము. తనంత తేలికగా మధు విషయంలో ప్రవర్తించినందుకు తనని తానే తిట్టుకుంది మాలతి.

మర్నాడు మధు ఇంటికి ఇద్దరం వెళ్ళి వాణ్ణి తగిన అమ్మాయినిచూసి పెళ్ళిచేసుకోమని మరీమరీ వత్తిడి చేసాం. ఈ మాటు బాబిగాణ్ణి ఎత్తుకున్న మాలతి వాణ్ణోడిపించి, తనేడవకుండా వాడికి అమ్మ మళ్ళీ వస్తుందని మరిపించి సంతోషపెట్టడానికి ప్రయత్నించింది.

---

కథానిక

# అన్వేషణ

"గోపి"

“పోస్టుమేన్! మాకేం ఉత్తరాల్లేవూ?”

“లేవు నా చిట్టితల్లీ!”

“మరందరికీ ఇస్తావ్!”

“వాళ్ళ కెవరో వ్రాశారు.”

“అబద్ధమాడుతున్నావ్! మా నాన్న రాయలేదూ నిజం చెప్పూ.”

ఇది రెండోసారి, ఆ చిన్నమ్మాయి పోస్టుమేన్ని నిలదీసి అలా ప్రశ్నలువేయడం. ఆరేళ్లుంటాయి. గులాబీ రెక్కల్లా బుగ్గలు, రీవి, ఎంతో ముద్దొస్తూంది ... పోస్టుమేన్ని అడిగాను “ఆ యింట్లో ఉన్నదెవరో?” అని.

“ఎవరో బాబూ! ఆ చిన్నమ్మకి లేదని చెప్పలేక నాకెంతో కష్టంగా ఉంది. మిమ్మల్ని అడుగుదామనుకుంటూ ఇలా వచ్చే” నన్నాడు, పజిల్డు ఫేస్ (puzzled face)తో.

ఆ పిల్లని చూచాక తల్లి ఎలా ఉంటుందో అన్న ప్రశ్న? ఎవరు? ఎందుకంత గోప్యంగా బ్రతుకుతున్నారు? బహుశ చుట్టుపక్కలవారిని వాకబుచేస్తే తెలియొచ్చు, అని అనుకున్నాను. కాని ఎప్పుడూ మూసే ఉన్న తలుపు వెనకాల తరుణి నా కుతూహలాన్ని పూర్తిగా రెచ్చగొట్టింది...బహుశ నే నుండే పరిసరాలుగురించి చెబితే మీకు కూడా నాఅంత కుతూహలం పుడుతుందేమో. ఒకపక్క గొల్లపేట. రెండోపక్క ఏతగూడెం, సన్నని బాట. కొంచం దూరంలో కోనేరు అక్కడమట్టుకు కలకలలాడుతూ జనసంచలనం ఉంటుంది. నేనున్న ఇల్లూ, ఎదురుగుండా ఉన్నదీ పెంకుటిల్లు తక్కినవి తాటికమ్మ, పురితో నేయబడినాయి. మా స్నేహితులు రెండేళ్ళా, ఈ పరిసరాల్లో గడప దల్చినందుకు నాకు ‘వీరచక్రం’ ఇవ్వొచ్చంటారు. కాని తలుచుకుంటే ఎక్కడన్నా గడపవచ్చు. ముందిల్లు ఎప్పుడూ ఖాళీయే. కాని వారం క్రిందట అనుమానం వేసింది, ఎవరో నివసిస్తున్నట్లు. చిన్నమ్మాయిని ఒకటి రెండుసార్లు చూశాను. కాని అంతగా ఆలోచించలేదు నాలుగు రోజులు సెలవలుకూడా

వచ్చాయి. "ఏముంది. కిటికీదగ్గర కూర్చుంటే సులువుగా కనుక్కో వచ్చు. ఈ మహాద్భాగ్యానికి మరోళ్ల నడగడం కూడా"నని, వాలుకుర్చీ కిటికీ దగ్గర వేసుకుని చదవకపోయినా పుస్తకం ముందే సుకుని కూర్చున్నాను.

పుట్టగోచీ, కర్ర, తాటికమ్మ గొడుగు, 'టిర్, టిర్' మంటూ మేకలతుందని తోలుకుపోయాడు కోనారి. రేగినఋగ్గితెర వెనకాల మూసివున్న తలుపు తెరచినట్లుంది. గుండె దడదడా కొట్టుకుంది. నేనేమీ మహత్తర కార్యం కాని, అసహాజమైన పనికానీ చేయటంలేదు. ఆ తెరమీద ఊహా జనితంగా ప్రతిబింబించిన ముగ్ధ సుందరి చిత్రం చూచాను. చక్కని క్రిస్ట్మస్ బొమ్మలాగ, అజంతా చిత్రానికో make up ఇచ్చినట్లు ఎన్నో విధాల కదలించింది. ఋగ్గితెర వాలిపోగానే ఆ తలుపు యధావిధిగా మూసేవుంది. పాలుపెరుగు అమ్మడానికి వెళ్ళినవాళ్ళు తిరిగి వచ్చేస్తున్నారు. ఆకలౌతూంది. కాని "ఎవరో" తెలుసుకోవాలన్న పట్టుదలకూడా ఎక్కువౌతూంది. చిన్నపిల్ల ఎక్కడో ఆడుకుని తిరిగివచ్చి తలుపుతట్టింది. తలుపు ఓరువాకిలిగా తెరువబడి మూసుకుంది మళ్ళా.

సెలవదినంనాడు ఇంటిదగ్గరుంటే, గూడెంలో వాళ్ళకి ఉత్తరాలు వ్రాయడంతప్పదు. అదిసాకూ ఒకవిధంగా సరదావే! "ఆది" వచ్చింది. "ఏం బాబూ మా ఈరిగాడికి ఓ ఉత్తరంముక్క రాపించవా?" కార్డువ్రాయటం చాలాసులభమనుకునేరు. అదిచెప్పినప్పుడే కార్డువ్రాయటంమొదలు పెడితే, ఆరుకార్డులు వ్రాసినా అసలు విషయం రాదు. అందుకది చెప్పినదంతా రాస్తున్నటే నటించి అసలువిషయం వ్రాసి, పూర్తిచెయ్యాలి.

"రాపిస్తాకాని, కేరియరికో అన్నమెట్టుకు రాయే ఓటుల్లోనుంచి" అన్నా వాళ్ళభాషలో. కేరియరు పట్టుకెళ్ళింది అది...అన్నంతిని, కార్డు వ్రాస్తూ అడిగా "ఆదీ! ఆయింట్లో ఉన్నదెవరే?" అని.

"తెల్దుబాబూ నెలపొద్దైంది; ఆ సిన్నమ్మాయినితప్ప ఇంకేర్నీ సూపునేదుబాబూ, ఇంకా విన్నడుగుదామనుకుంటున్నా"నంది. కార్డుపూర్తి చేసి పంపించేశాను. భోజనం చేసేసేమో, వాలు కుర్చీమీద నడుంవాల్చి, పడిపోతున్నా రెప్పల్ని బలవంతాన్ని తెరచి ఉంచాను. "ఎప్పుడు వస్తాందో బయటికి ఆమె" అని. పన్నెండు, ఒంటిగంట, రెండుగంటలు ... ఏమీశబ్దంలేదు. చుట్టూవున్న పల్లెజనంమీద కోపంవచ్చింది. వీధిలో ఎవరున్నారోకూడా వీళ్ళకక్కరలేదు. దొంగలొచ్చి నివాసంచేసినా ఫరవాలేదు... మళ్ళా నవ్వొచ్చింది ఏంవిటి దోచుకోపోవాలిగనక?... తీరుబాటుండొద్దూ!...రెండుగంటలకి "బంగారి" సిద్ధం.

"బాబూ ఇంట్లోనే ఉన్నావా? కలవరోజు గవల. మా అయ్యకో కార్డు రాపిస్తావా?" అడిగింది బంగారి.

"పట్టుకురాయే కారుడు" అన్నా.

"నేదుబాబూ" అంటూ పయటకొంగు ముడి విప్పి మూడుకాన్లు నా ముందుపెట్టింది. ఎదురు తలుపు నోకంటచూస్తూ కార్డుతెచ్చుకున్నాను... బంగారి యతల్లో కాస్తబాగుంటుంది, దూరం నుంచి చూస్తేనే దగ్గరకొస్తే దుర్గంధం. దానికి సెక్సువిషయాలు మాట్లాడ్డం సరదా. "ఏటిబాబూ దిగాలుగా ఉన్నావు" అంది

"ఆదోమోస్తరుదీనిలా ఉందే" అన్నా; అదో జవాబులాగ! ఇంతకీ ఉదయంనుంచీ, అక్కడే కాపలా కాయడాన్న ముఖం జిడ్డుబారి ఉంది. అందుకని ఆ రిమార్కు.

"అంతేబాబూ అమ్మగారొచ్చేదాకా అలాగే ఉంటాది" అంది, కొంటెగా చూస్తూ.

"సర్లే నీసోది కానివ్వు" అన్నా ఏదో పెద్ద కోపంవచ్చినట్లు... తలుపుచప్పుడు. సింపుల్‌గా శుభ్రమైన గౌను తొడుక్కొని బయటికి వచ్చింది చిన్నపిల్ల.

"బంగారీ ఆపిల్ల నిల్లా లాక్కురావే"అన్నా.

"ఓరున్నారు బాబూ ఆయింట్లో, వొప్పుడూ మూసే వుంటాది"అంది కమెంటుగా. అంటే దానికీ తెలీదన్నమాట. నాలుగుచాకలేట్లు బంగారికిచ్చా పిల్లకి లంచంగా. వీధిలో కెడుతూ, అటూ ఇటూ చూచి, కాగితంతోనే నోట్లో పడేసుకుందొకటి. ఆపిల్ల కాళ్ళు ఎడంగాపెట్టి ఠీక్‌గా నిలపడింది. పిల్లతో నేదో చెబుతూ, మిగతా మూడు చాకలేట్లూ చూపించింది. "ఛీ" అంది పిల్ల.

"అకేటి ఇస్త్రమమ్మా పిప్పరెంటొద్దా?" అంది. పిల్ల మాట్లాడకుండా వెళ్ళి తలుపుకొట్టింది. తలుపు తియ్యగానే వెళ్ళిపోయింది. బంగారి పరాజితమై, "ఎక్కడా సూణ్ణేదు ఇల్లాంటి బొట్టిని" అంటూ సిగ్గుపడుతూ మిగతా మూడు చాకలేట్లు నాముందు పడేసింది. కార్డు వ్రాసి పూర్తిచేసి ఆ చాకలేట్లుకూడా తీసుకెళ్లు అని దానికి డిస్పోజల్ పెట్టాను. కట్టుదల మరీ ఎక్కువైంది. చదివిన పెర్రీ మేసన్ మిష్టరీలు జ్ఞాపకం రావడం మొదలుపెట్టాయి. వాడి తస్సాదియ్యా, వాడేఐతే ఒక గంటలో ఎదో టెలిగ్రామో, మనియార్డరో మిషపెట్టి తలుపుతెరిపించి, వాళ్ల అంతు కనుక్కునేవాడు. ఉదయం ఎలాఉందో ఇప్పుడూ అలాగేఉంది పరిస్థితి. అదే ఓపికతో కూర్చున్నా ఆ కిటికీదగ్గరే...పిల్ల మళ్ళా బయటకివచ్చింది. నా వైపుచూచింది. రమ్మని చెయ్యూపాను. ఊం, హూం, చూచినట్లయినాకనబడలేదు. జేబులోంచి బిసకత్తులుతీసి గొల్లవాళ్ళకుక్కకిమేపి 'లిల్లీ', 'లిల్లీ' అంటూ ఆడుకుంది. ఆమె నడవడిచూస్తే చాలా కులీనుల పిల్లలా కనబడింది.

ఆరుగంటలు కొట్టారు. వెంకటేశం సిద్ధం. "రాజావారివ్వాళ పేలెస్ విడిచివచ్చే సూచనలేం కనబడదే!" నాలాడ్జి వాళ్ళకి వెటకారం కాదోయ్! "టెర్మినల్ ఎగ్జామ్సుకి కాస్త రుబ్బుతున్నాను." అన్నా వాళ్ళ ధోరణిలోనే.

"రేపు నెల్లిమర్ల వస్తున్నావా లేదా?"

"సారీ బ్రదర్"

"సారీ లేదు, గీరీలేదు, నువ్వొస్తున్నావు. ఆ తుప్పలన్నీ చేతులుచాచుకు చూస్తున్నాయి, నీ హార్బరియంలో పడి చద్దామని, కర్ణుడులేని భారతం ఎక్కడాలేదు" అన్నాడు ఫైనల్‌గా.

"వస్తానుగాని మరోగంట చదువుకోనీ"

"రైట్, నెల్లిమర్లనుంచి సింహాచలంకూడా ట్రిప్ ఉండొచ్చు. నువ్వొస్తున్నావు జ్ఞాపకం ఉంచుకో!"

"మరిచిపోడంకూడానా స్వామీ?..." అన్నా. అన్న ప్రకారం వెళ్ళిపోయాడు...తల నొప్పి ప్రారంభించింది. పదిగంటల రాత్రివరకూ చూచి అవాళకంతేనని, మర్నాటి నెల్లిమర్లకి సరంజా అంతా సర్దుకు పడుకున్నా. మళ్ళా ఆరుగంటల అలారంతోనే తెలివిరావటం. లేచేసరికి పట్టుదల మళ్ళా మొలకెత్తింది. కాని సెలవల్లోకూడా స్వతంత్రంగా బతకకుండా వీడోకడు. మన భారతరాజ్యాంగం, వ్యక్తి స్వాతంత్ర్యం ఇస్తాదంటారు. ఎవరికో? నా లాడ్జిలో నేనుండడానికూడావీల్లేదు. ఎలాగో మూడురోజులు వృధాగా గడిచినట్లే అనిపించింది నాకు. సోమవారం వచ్చింది. అసలే కాలేజీ దూరం నాలుగో ఏడాదికి హాంగు క్లాసులు, ప్రైవేటుక్లాసులు, టూర్లు. వచ్చే వారంలో అరుకు, డుడుమ, జయపురం, ఎక్సెకర్షన్. రికార్డులు వ్రాయాలి. ఇవన్నీ తలుచుకుంటే భయమేస్తూంది. పొద్దున్నపోతే రాత్రి తిరిగివచ్చేవాణ్ణి. కాని ఇంటికిరాగానే "ఎవరా ఇంట్లో ఉన్నది" అన్న ప్రశ్న చదువుసాగనిచ్చేది కాదు.

ఆవేళ బుధవారం. పుస్తకం మూశా. రాత్రి ఎనిమిది దాటింది. సద్దుమణిగిందప్పుడే. ఉదయం ఏ నాలుక్కో లేస్తారా, చీకటిపడేసరికి నిద్రపోతారు పల్లెప్రజలు. ఎదురు తలుపు చప్పుడైంది. గబగబా షర్టువేసుకోబయలుదేరాను. ఆమె నల్లని మేలిముసుగువేసుకుని అటూఇటూ చూస్తూ ముందుకి సాగింది. నా మనోదృశ్యంలో చూచినట్లే కనిపించిందా చీకటిలో. కాని ఎక్కడా లైటులేకపోడాన్న సరిగ్గా కనపడలా. గుండె బద్దలైపోయేట్లు కొట్టుకుంటున్నది లోపల. ఎందుకో? నేనేం తప్పుచెయ్యలేదే! ఆమెకో ఆరు గజాల దూరంలో అనుసరించేను. ఎక్కడున్నా ఎలక్ట్రిక్ దీపం తగలగానే ముందుపోయి చూద్దామని. మారుమూలల సందులుతిరిగి, ఒక పదిహేను నిముషాల్లో ఒక పూరి ఇంట్లోకి వెళ్ళిపోయింది. గంట వరకూ డిటెక్టివ్ నవల్సులోలాగ ఇటుతిరిగి, అటు తిరిగి, ఆగాను. ఇప్పుడు చదువు దండుగైపోతున్నదే, నాలుగో ఏడాది అని మనస్సులో ఆవేదన. సరి గంట తరువాత లాడ్జి చేరుకున్నాను. వాలుకుర్చీమీద కిటికీదగ్గర పడుకున్నా మళ్ళా తెరుగుదలలో ఏలావస్తుందో అని...టార్చి తీసి తలుపుమీద వేశాను. కప్పతాళంవేసిఉంది. మన దగ్గర ఒక తాళంచెవిగుత్తికూడా లేదు. వెధవది సమయానికేవీ ఉండవు అని విసుక్కున్నా... ఇంతలో తెలివ్వొచ్చింది. ఆరుగంటలైంది ఉదయం.

ఎనిమిదిగంటలకి, రోజూవస్తూ వచ్చాడు పోష్టుమాన్. "ఏం ఇంత హడావుడి" అన్నా. మనియార్డర్ బాబూ. కాలేజీ పోస్టుమాన్ ఇచ్చే మంటాడు ఇంటి అడ్రస్‌కి స్తే. అందుకని మీకో సానికే ప్రత్యేకం వచ్చా"నన్నాడు. అదంతా బక్షీస్ కోసం. ఎక్కడినుంచివచ్చిందో చిన్నపిల్ల-

"నాకుత్తరంలేదూ?"అంది

"ఏంపేరు చిట్టీ"అన్నా ఎంతో సరదాగా.

"నీకెందుకూ?"అంది కటువుగా ఆశ్చర్య పోయా! పోస్టుమేన్ కూడా అదే అడిగాడు.

"జాజి"అంది. "ఎంత చక్కని పేరు" అన్నా. పోష్టుమాన్‌కో రూపాయి, పిల్లకో రూపాయి ఇచ్చా, పోష్టుమాన్‌కి నా పాతఉత్తరం ఒకటిచ్చి కనుసంజ్ఞచేశాను. పిల్ల రూపాయినోటు పట్టున ●చించి కార్డు పట్టుకో తుఱ్ఱున పారిపోయింది. అంతా కన్నుమూసి తెరచేలోపునైంది. పోస్టుమాన్ చకితుడై నిలబడిపోయాడు. నాకు పరాజయంతో కోపం, ఏడుపు కూడావచ్చాయి.'ఇంటెదురుగుండా ఉన్న దెవరో పోల్చుకోలేకపోయానే ఎందుకీ తెలివితేటలు, చదువు, డిగ్రీలు' అనికాని త్వరగా తయారైనా, హోటలుకి, తరువాత, కాలేజీకి పోయేందుకు.

శుక్రవారం, మధ్యాహ్నం సెలవిచ్చారు. ప్రయాణం తయారీకి. ఆత్రుతగావచ్చా. ఒక పక్క సర్దుకోడం, రెండోపక్క తలుపుచూస్తూండడం. కాని ఏమీ లాలేదు. వారం పదిరోజులు ప్రయాణం. ఎలా ఉంటుందో ఆలోచించండి. ఊపిరి తియ్యడానికన్నా తీరుబాటు లేనిపని.

ఆత్రంగా తలుపు తెరిచాను, టూర్‌నుండి వచ్చాక. పాలది వచ్చింది. "ఎల్లమ్మా ఏఁవిటి సంగతులు?" అన్నా "తప్పకుండా ఎల్లిపోయిది. వేటి బాబూ, పరారైపోతూవనున్నా" నంనా "సరేకాని ఎదురింటావిడికి నువ్వుపాలివ్వటం లేదా?" అన్నా ఊపిరి బిగపెట్టుకొని.

"ఎదురుగుండా ఎవళ్ళున్నా రా? నాసెప్పేడూ సూపునేదు. మొన్నగంతె ఆది సెప్పింది. ఓ అమ్మ వరో. ఒకనెలుండి ఎల్లిపోనాదని' పాపం ఎల్లికేం తెలుసు నా ఆత్రం. నాగుండె గతుక్కుమంది, 'నేకనుక్కోకుండానే ఇల్లుకాళీ చేసేసింది' అని తెలియగానే. ఎల్లి వెళ్ళిపోయింది. 'సదువుల రోజులు, సిక్కిపోయిగావు ప్రయాణాల్లో, రాతిరికో పావు పాలు ఎక్కువతీసుకో' అని సలహా ఇచ్చి ......ఐనా మనకో ఇల్లు తెలుసు ఆఇంట్లో వాకబుచేస్తే తెలుస్తుంది. ఐనా ఏమని వాకబు చేయడం. 'ఆరేళ్ల అమ్మాయి, అందాల తల్లి' మనకి తెలిసినభోగట్టా అంతా ఒక్కసారి నస్పృహ ఆవరించింది .. మన్నాడు శర్మతో చెప్పా. 'అబ్బా ఈ లాడ్జీ కాళీ చేయాలనుందని' ఆప్యాయముగా ఆహ్వానించాడు తన లాడ్జికి. వెళ్ళాకనా అన్వేషణాంతా చెప్పావు, 'నువ్వీ పరీక్షలు పాసై బయటబడితే అలాంటివి చాలా చేయొచ్చులే' అన్నాడు తేలిగ్గా.

సెలవలు. తీరుబడగా రోడ్డు సర్వే చేస్తూంటే ఏ పిల్లయినా పోస్టుమాన్‌ని ఉత్తరాలడుగుతే 'జాజి' జ్ఞాపకం వస్తుంది... తీరుబాటువల్ల కలిగే గాలి - మేడల ఊహల్లో, ఎన్నోసార్లు అకస్మాత్తుగా 'ఆమెని' కలుసుకున్నట్లు పరిచయం కలిగినట్లు ఊహించా. కథలల్లుకున్నా. పద్యాలు వ్రాసుకున్నా. కాని... నా అన్వేషణ అలాగే ఉండిపోయింది.

---

ఉన్న పరిస్థితిని అస్తమానం యింకోరకం పరిస్థితితో పోల్చుకుంటూ ఉండడం ప్రమాదకరం; ఆనందించదగినది ఏదైనా జీవితంలో లభించినప్పుడు, ఆ తరుణం సద్వినియోగం చేసుకుని, సుఖపడడం వివేకం: అంతేగాని, యీ సౌఖ్యం ఇంకోరకం సౌఖ్యం అంత బాగాలేదనీ, యిదేరకం సౌఖ్యం యింకెవరికో యింతకన్నా ఆనందం యిచ్చిందనీ బెంగపడితే విచారంతప్ప యింకేం మిగలదు.

—బెర్ట్రాండ్ రసెల్.